క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మంచికంటి హాల్‌లో సీపీఎం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యాన శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో డయాబెటిక్, కంటి, కిడ్నీ సంబంధిత పరీక్షలు, బీపీ, షుగర్, తదితర అనారోగ్య సమస్యలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేయనుండగా.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

న్యాయవాదులకు క్రికెట్ పోటీలు..

ఖమ్మం లీగల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులకు శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ క్రీడల కార్యదర్శి రావుల వెంకట్ తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్. జగ్జీవన్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు క్రీడల కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 26వ డివిజన్ ఎస్పీ ఆఫీస్ రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు, సీసీ కాల్వల నిర్మాణ పనులను గురువారం మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యత లోపించకుండా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సతీష్, సంక్రాంతి ప్రసాదు, పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


అబ్దుల్ రెహమాన్

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా ఖమ్మంకు చెందిన అబ్దుల్ రెహమాన్ నియమితులైనట్లు రాష్ట్ర కన్వీనర్‌సయ్యద్ సలీం పాషా ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ.. తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలుపగా.. పలువురు ఆయనను అభినందించారు.

నేత్రదానం..


మృతుడు

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని 60వ డివిజన్ రామన్నపేటలో మృతిచెందిన సోదరుడి నేత్రాలను కట్ల నరసింహారావు గురువారం నేత్రనిధికి దానం చేశారు. తన సోదరుడు భౌతికంగా తమతో లేకపోయినా నేత్రదానంతో అందరి మనసుల్లో జీవించే ఉంటాడనే ఉద్దేశంలో దానం చేసినట్లు ఆయన తెలిపారు.

డీవైఎస్‌ఓను కలిసిన వీఆర్‌ఏల సంఘం

ఖమ్మం సహకారనగర్: జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి(డీవైఎస్‌ఓ)గా తుంబూరు సునీల్ రెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించగా.. గురువారం వీఆర్‌ఏల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు చల్ల లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు ఉపేందర్ చందూమియా, రాము వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సామగ్రి పంపిణీ



పైనంపల్లిలో మెటీరియల్ పంపిణీ చేస్తున్న సొసైటీ బాధ్యులు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి సొసైటీ ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం మెటీరియల్స్ డీసీఎంఎస్ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మొత్తం 170 మంది విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్స్, జామెట్రీ బాక్సులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ, ఎంపీటీసీ లక్ష్మయ్య, సీఈఓ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కందాళ ఫౌండేషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు ఎమ్మెల్యే సతీమణి కందాళ విజయమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంత తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	మెగ్ 2
సాయిరాం	హెబ్బులి, బ్రో
ఆదిత్య	బ్రో
శ్రీనివాస	ఎల్‌జీఎం

- ఖమ్మంగాంధీచౌక్

ఇటీవల కురిసిన వర్షాలకు ఉధృతంగా ప్రవహించిన నర్సింహులగూడెం–కిష్టాపురం మధ్య వాగు



ఎన్నాళ్లీ కష్టాలు..!

హైలెవల్ కాజ్‌వేలు లేక ప్రజల ఇక్కట్లు

- వాగులు పొంగితే రాకపోకలు బంద్
- రోజుల తరబడి తప్పని తిప్పలు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన
- గతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్న వైనం


కొత్తూరు వద్ద వాగు దాటేందుకు ప్రజల తిప్పలు

వానాకాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామాలకు కష్టాలు వచ్చినట్టే. వాగులు ఉప్పొంగినప్పుడల్లా ఆయా గ్రామాలకు రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. చప్టాలు ధ్వంసం అవడంతో ఏ చిన్న వర్షం పడినా చుట్టు పక్కల వాగులు పొంగి, పొలాల నుంచి వరద రోడ్డుపై పారడంతో వాగు వద్ద కష్టాలు తప్పడం లేదు. కొందరు చుట్టుపక్కల గ్రామాల నుంచి తిరిగి వస్తుండగా.. మరికొందరు తప్పనిసరి పరిస్థితిల్లో వాగు దాటుతున్నారు. ఈనేపథ్యంలో గతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇటువంటి కష్టాల మధ్య జీవనం సాగిస్తున్న ఆయా గ్రామాలపై ఓ లుక్ వేద్దాం.

కూసుమంచి: గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఉన్న చప్టాలు కాస్త ధ్వంసం అయ్యాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇటు స్థానికులు.. అటు వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు ఉప్పొంగి రోడ్డుపై ప్రవహిస్తుండడంలో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. వాగుల ప్రాంతంలో హైలెవల్ కాజ్‌వేలు నిర్మిస్తే తమ కష్టాలు తొలగుతాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

నర్సింహులగూడెం–కొత్తూరు రహదారిలో..

ఈ గ్రామాల మధ్య వాగుపై హైలెవల్ కాజ్‌వే లేక వర్షాలు పడినప్పుడల్లా.. వరదనీటితో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వరి పొలాలు నిండి నీళ్ల వరదలా రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. కాగా, ఈ రహదారిలో మండలంలోని కొత్తూరు, ఎర్రగడ్డతండాలో పాటు సమీప సూర్యాపేట జిల్లాలోని తుమ్మగూడెం, గోపతండా, నేరడవాయి గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు అనువుగా ఉంటుంది. దీంతో వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగస్తులు వాగుదాటుతుంటారు.ఈక్రమంలో గతంలో వాగు ఉధృతికి ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే.

నర్సింహులగూడెం– కిష్టాపురం దారిలో ..

మండలంలోని నర్సిహులగూడెం గ్రామం వద్ద కిష్టాపురం రహదారిలో వాగు ప్రవహిస్తే ఈ రహదారిలో రవాణా స్తంభిస్తుంది. వాగు పొంగినప్పుడు వారం పాటు రాకపోకలు బంద్‌కావల్సిందే. దీంతో ఇటు ప్రయాణికులు, అటు రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది.

పొంచి ఉన్న ప్రమాదం..


చౌటపల్లి వద్ద దెబ్బతిన్న చప్టా(ఫైల్)

మండలంలోని చౌటపల్లి గ్రామ శివారులోని బీరోలు రోడ్డులో ఉన్న వాగు వద్ద ప్రమాదకరంగా మారింది. కొద్దిపాటి వర్షాలకే ఇక్కడ వాగు రోడ్డుమీదుగా ప్రవహించడంతో ప్రమాదం పొంచి ఉంది. కాగా, నర్సింహులగూడెం వద్ద హైలెవల్ వంతెన నిర్మాణం కొనసాగుతుండగా.. చౌటపల్లి వద్ద పనులు ప్రారంభించాల్సి ఉంది. ఇక నర్సింహులగూడెం–కొత్తూరు గ్రామాల మధ్య ఉన్న రహదారిపై లోలెవల్ కాజ్‌వేకు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు. నర్సింహులగూడెం–కిష్టాపురం గ్రామాల మధ్య హైలెవల్ వంతెన నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో కిష్టాపురం పరిధిలో భూములు ఉన్న నర్సింహులగూడెం రైతులు నానుతండా మీదుగా 8 కిలోమీటర్లు అదనంగా తిరిగి రావాల్సి వస్తోంది.

చుట్టూ తిరిగి వస్తున్నాం..



మా ఊరుకి కిష్టాపురానికి మధ్య వాగుపై వంతెన నిర్మిస్తున్నారు. ఎండాకాలం పనులు ప్రారంభించినా.. నేటికి పనులు పూర్తి కాలేదు. ఇప్పుడు వాగు పొంగుతోంది. చేలకు వెళ్లాలంటే నానుతండా మీదుగా 8 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుంది. వంతెన పూర్తయితే మా బాధలు పోతాయి.

– జక్కుల మల్లయ్య, రైతు, నర్సింహులగూడెం

వంతెన నిర్మించాలి..



నర్సింహులగూడెం–కొత్తూరు గ్రామాల మధ్య వాగు ఉండడంతో వర్షాకాలం ఎగువన కురుస్తున్న వర్షాలకు వాగు ఉధృతంగా పొంగుతోంది. ఈ వాగు వచ్చినన్ని రోజులు రాకపోకలు నిలిచిపోవాల్సిందే. అధికారులు, పాలకులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించి కష్టాలు తొలగించాలి.

– బజ్జూరి వెంకటరెడ్డి, కొత్తూరు

రైతులకు నష్టపరిహారం అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల వెంకటేశ్వర్లు

రఘునాథపాలెం: ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం అందించాలని ఏఐపీకేఎస్ జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మంచుకొండలో నిర్వహించిన అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఖమ్మం డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగపూర్ నుంచి అమరావతి వరకు వెళ్లే రోడ్డు నిర్వాసిత రైతులు ఆగస్టు 7 కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యే రుణాలను వడ్డీ లేకుండా ఇవ్వాలని, రుణమాఫీ వెంటనే అమలు చేయాలని, కనీస మద్దతు ధరల హక్కు చట్టాన్ని వెంటనే చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో నాయకులు వడ్డె వెంకటేశ్వర్లు, కేశోతు లక్ష్మణ్, ధరావత్ లక్ష్మణ్, భూక్యా రమణ, కుప్పాల చిన్న రామారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: నూతన జాతీయ విద్యా విధానం–2020ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బున్న వాళ్లు మాత్రమే చదువుకునే విధంగా ఈ విద్యావిదానం ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీల, ఎంపీల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఈ విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, సహాయ కార్యదర్శి సరళ, సాయి, ఉపాధ్యక్షులు రాజు, సభ్యులు సంగీత తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వితరణ


సామగ్రి అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం మామిళ్లగూడెం: మున్నేటి వరద బాధితులకు గురువారం ఖమ్మం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన వంట సామగ్రి, దుప్పట్లు, టార్పాలిన్ షీట్లు వంటి రూ.లక్ష విలువైన వస్తువులను చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ పంపిణీ చేశారు. నగరంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వర కాలనీ, పద్మావతి నగర్ కాలనీలో 550 కుటుంబాలను సర్వే చేసిన అనంతరం డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, తోట రామారావు సహకారంతో బాధితులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, స్టేట్ కమిటీ మెంబర్ సాధినేని జనార్దన్‌రావు, వైస్ చైర్మన్ రామడుగు రవీందర్‌రావు, జి.సూర్యప్రకాష్‌రావు దుప్పట్లను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎ.గోవర్ధన్‌రావు, జిల్లా వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, గజేంద్రుల నాగేశ్వరరావు, జీఆర్‌సీవైఆర్‌సీ కోఆర్డినేటర్ ముజీబ్, తాత రాఘవయ్య, ఉప్పలయ్య, సాయికుమార్, తోట రమేష్,రవి, గోపి, వలంటీర్లు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో గత పదేళ్లుగా దాతల సహకారంలో కొనసాగుతున్న ఇటికాల విశ్వనాధచారి, వజ్రమ్మ పేరుతో ఉన్న గ్రంథాలయానికి అదనపు గదులు మంజూరు చేయాలని గురువారం గ్రామ గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యాన సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ప్రస్తుతం గ్రంథాలయం ద్వారా రక్తదానం, కుట్టుమిషన్ శిక్షణలాంటి పలు సేవా కార్యక్రమాలతో పాటు పుస్తకాలు, వార్తా పత్రికలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ చైర్మన్ కొటేరు వెంకటరెడ్డి, కమిటీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, లైబ్రరీ సహాయకుడు యాకుబ్‌మియా తదితరులు పాల్గొన్నారు.

‘నులి’పేద్దాం..


కూసుమంచి: ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్


తిరుమలాయపాలెంలో మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ శ్రీనివాస్

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు గురువారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను పలువురు ప్రజాప్రతినిధులు ప్రారంభించగా.. ఏఎన్ఎంలు మాత్రలను విద్యార్థులచే మింగించారు. నులిపురుగుల వ్యాప్తి, వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తపై పలువురు వైద్యులు వివరించారు.

– సాక్షినెట్‌వర్క్

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ


నాయకులకు సర్క్యులర్ అందజేస్తున్న డీఈఓ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ ఇస్తూ డీఈఓ సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్(టీయూడబ్ల్యూజే–ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా గురువారం మాట్లాడుతూ తమ యూనియన్ విజ్ఞప్తితో సానుకూలంగా స్పందించిన డీఈఓ సర్క్యులర్ జారీ చేశారని పేర్కొన్నారు. ఈసందర్భంగా డీఈఓ నుంచి కాపీ తీసుకోగా, నాయకులు ఆవుల శ్రీనివాస్, చెరుకుపల్లి శ్రీనివాసరావు, వై.మాధవరావు, జనార్ధనాచారి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ..

తిరుమలాయపాలెం తహసీల్దార్‌గా రాంప్రసాద్..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల తహసీల్దార్‌గా రాంప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ డి.పుల్లయ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ కాగా మహబూబాబాద్ జిల్లా నుంచి రాంప్రసాద్ బదిలీపై తిరుమలాయపాలెం వచ్చారు.

రఘునాథపాలెం తహసీల్దార్‌గా లూథర్ విల్సన్..

రఘునాథపాలెం: రఘునాథపాలెం తహసీల్దార్‌గా జి.లూథర్ విల్సన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ నరసింహారావు పదోన్నతిపై అదనపు కలెక్టర్‌గా నల్లగొండ జిల్లాకు బదిలీ కాగా కొత్తగూడెం జిల్లా నుంచి విల్సన్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తిరుమలాయపాలెం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మంగీలాల్ అన్నారు. గురువారం వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టాలు, సీజనల్ వ్యాధులపై నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఇటీవల దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామారావు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల నిర్వహణపై సమీక్ష


నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై గురువారం కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పులు, లొకేషన్ పేరు మార్పు, కొత్త లొకేషన్ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బూత్ లెవల్ ఏజెంట్ల జాబితా

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాను మన్‌కీ బాత్ రాష్ట్ర కన్వీనర్ గెంటేల విద్యాసాగర్ ఆధ్వర్యాన గురువారం ఖమ్మం నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కేఎంసీ కమిషనర్ ఆదర్శ సురభికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, నాగరాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా

నేలకొండపల్లి: మండలంలోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారులు కె.జమలారెడ్డి(ఎంపీడీవో), సీహెచ్.శివ (మండల పంచాయతీ అధికారి) గురువారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఫార్మాట్ ప్రకారం..సెక్టోరల్ అధికారి జమలారెడ్డి చెరువుమాధారం, రాయగూడెం, అప్పలనరసింహాపురం తదితర గ్రామాలు, మండల పంచాయతీ అధికారి శివ కోనాయిగూడెం, రాజేశ్వరపురం, అమ్మగూడెం తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయడంతో పాటు కేంద్రాలకు సమీపంలో ఎవరైనా రౌడీ షీటర్లు ఉన్నారా? దివ్యాంగులకు ర్యాంపు సౌకర్యం, విద్యుత్, తాగునీరు, భవనం వంటివి అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీసి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నారు. వీరి వెంట ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘స్మార్ట్ కిడ్జ్’ జ్యూట్ బ్యాగుల ఆవిష్కరణ


బ్యాగులను ఆవిష్కరిస్తున్న మేయర్, కరస్పాండెంట్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్: నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యాన తయారు చేసిన జ్యూట్ బ్యాగులను గురువారం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ నిషేధానికి ప్రత్యేకంగా జ్యూట్ బ్యాగులను తయారు చేయించడం అభినందనీయమని మేయర్ పేర్కొన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. తమ పాఠశాల ఆధ్వర్యాన ప్రతి ఏటా జ్యూట్ బ్యాగులను తయారు చేసి ప్లాస్టిక్ నిషేధానికి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి దాదాపు రూ.50వేలతో బ్యాగులు తయారు చేయించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాణి, మహంతి, కార్పొరేటర్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆశాజ్యోతి సున్నం రాజయ్య

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం శాసనసభ్యుడిగా మూడుసార్లు పనిచేసి అందరి మన్ననలు పొందిన గిరిజన ఆదివాసీ ముద్దుబిడ్డ సున్నం రాజయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కొనియాడారు. గురువారం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.ప్రకాశ్ అధ్యక్షతన సుందరయ్య భవన్‌లో నిర్వహించిన రాజయ్య మూడో వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజనుల సమస్యలను శాసనభలో ప్రస్తావించడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేశారని, తనకున్న పదిహేను ఎకరాల వ్యవసాయ భూమిని సైతం గిరిజనుల అభివృద్ధికి రాసిచ్చిన గొప్ప నేత అంటూ నున్నా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, జిల్లా నాయకులు వై.శ్రీనివాస్‌రావు, పగడాల నాగేశ్వరరావు, రామకృష్ణ, ఎస్.కె.అఫ్జల్, కల్యాణం నాగేశ్వరరావు, వాసిరెడ్డి వీరభద్రం, తుడుం ప్రవీణ్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన..

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కార్యనిర్వాహక కమిటీ ఆధ్వర్యాన గ్రామ కూడలిలో గురువారం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాంకుడోత్ విజయాదీపక్, సుడా డైరెక్టర్ మందడపు నరిసింహారావు, ఉపసర్పంచ్ రమేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన జిల్లా అధ్యక్షుడు మందా సంజీవరావు, భూక్యా రాము, మాజీ సర్పంచ్ చెన్ను లింగం కమిటీ సభ్యులు మందా విజయరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న తలపెట్టిన చలో ఇందిరాపార్కును జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ కోరారు. గురువారం దీనికి సంబంధించిన పోస్టర్లను ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కే.వీ. కృష్ణారావు ఆధ్వర్యాన ఖమ్మం మయూరిసెంటర్ అమరవీరుల స్తూపం ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఝార్ఖండ్‌లో మాదిరిగా ఇక్కడ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్, నరేందర్‌గౌడ్, వీరస్వామి, ఐలయ్య, సంపత్, పాలకుర్తి కృష్ణ, విద్యాసాగర్, రామారావు, శంకర్‌రావు, వీరభద్రం, పద్మాచారి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఖమ్మంరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా కస్తూర్బా, యూఆర్ఎస్, మోడల్ స్కూళ్లల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ అండ్ వర్కర్లకు ప్రభుత్వం బేసిక్‌పేను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నాయుడుపేటలో గల కేజీబీవీలో వర్కర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇంతవరకు నెరవేర్చలేదని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకురాలు తార, స్నేహలత, చంద్రకళ, మధు, కళావతి, విజయ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తెగిన పంట కాల్వ..


నీట మునిగిన వరి పొలాలు

నేలకొండపల్లి: పంట కాల్వ కోతకు గురై తెగడంతో ఆయకట్టు ప్రాంతంలో ఉన్న వరినాట్లు మునిగిపోయాయి. మండలంలోని బోదులబండ–మంగ్రాజుపల్లి గ్రామాల మధ్య ఉన్న పాలేరు పాత కాల్వ 29వ తూము వద్ద పంట కాల్వ గురువారం తెగింది. పంట కాల్వ రహదారి పక్కన కోతకు గురికావడంతో కాల్వ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తెగింది. దీంతో బోదులబండ గ్రామానికి చెందిన రమణయ్య, కోటయ్య, కిషోర్ తదితర రైతులకు చెందిన దాదాపు 8 ఎకరాల వరి నాట్లు పూర్తిగా మునిగిపోయాయి. వేలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేసుకున్న వరి నాట్లు నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాల్వ కట్టను బాగు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు



రఘునాథపాలెం: పాపటపల్లిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


తిరుమలాయపాలెం: పిండిప్రోలులో క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

కూసుమంచి/ఖమ్మంరూరల్/రఘునాథపాలెం/తిరుమలాయపాలెం: ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన మండలాల్లోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు చేశారు. రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అంటూ కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతులకు ఇచ్చిన మాటకు సీఎం కట్టుబడి ఉన్నారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్‌నాయక్, బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్, ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వేముల వీరయ్య, బెల్లం వేణు, మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, సర్పంచ్ చిన్నబోయిన ముత్తమ్మ, ఉప సర్పంచ్ వెంకటనారాయణతో పాటు కుతుంబాక నరేష్, చామకూరి రాజు, తొలపరూరి దానయ్య, కోదండరాములు, పరికపల్లి చంద్రశేఖర్, నాతి సత్యనారాయణ, కూరాకుల సత్యం,భద్రయ్య, కొండయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.